1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 25, 2024 | www.navatelangana.com

కలెక్టరేట్ ఎదుట కొనసాగిన రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తన భూమిని ఇప్పించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట రైతు జాదవ్ మోతీరామ్ చేస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన 10 ఎకరాల పట్టా భూమి నుంచి గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎకరన్నర తీసుకుని క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారన్నారు. తన భూమిని తనకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఆయన భార్య పీరుబాయి ఉన్నారు.



ఆవు మృతికి నష్టపరిహారం అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చిరుత దాడిలో మృతి చెందిన ఆవుకు అటవీశాఖ అధికారులు నష్టపరిహారం అందజేశామని ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ తెలిపారు. మండలంలోని మాణిక్‌గూడ వద్ద గల అర్బన్ పార్క్ వెనకాల సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన అప్పన్నకు చెందిన ఆవు మృతి చెందింది. మంగళవారం రూ.25వేల నష్టపరిహారం అందజేశారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ వన్యప్రాణులకు ప్రజలు హాని కలిగించకూడదన్నారు. వన్యప్రాణులతో పశువులకు హాని కలిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారులు రాజేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.



ఎన్నికల్లో హామీ మేరకు సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్



నవతెలంగాణ-భైంసా

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పునరావాస గ్రామస్తులందరికీ ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. సంవత్సరాల తరబడి అప్పటి ప్రభుత్వం స్థలాలు ఇచ్చినప్పటికీ హక్కు పత్రాలు లేకపోవడంతో రుణాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిర్వాసితుల సమస్యలను రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. 50వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కాళేశ్వరం 28 ప్యాకేజీ పనులకు రూ.320 కోట్లు ఇవ్వాలని, గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ సిసి లైనింగ్ పనులకు రూ.50 కోట్లు, గుండెగాం పునరావాసానికి నిధులు ఇవ్వాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారన్నారు. ఏరియా ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, అప్పట్లో 16 మంది డాక్టర్లు ఉంటే ప్రస్తుతం 32 మంది డాక్టర్లను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా మారుస్తామన్నారు. బ్రహ్మన్‌గావ్ లిఫ్ట్ ఇరిగేషన్, పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను యుద్ధప్రాతిపదికన చేపడతామన్నారు. కుభీర్‌లో 132/11 కెవి సబ్‌స్టేషన్, కోలూర్, మహాగాం, పల్సి, గ్రామాల్లో 33/11 కెవి సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఉన్న 190 చెరువులకు మరమ్మతులు చేయడానికి నిధులు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కుంటాలలో 30 పడకల ఆసుపత్రి, భైంసా, కుభీర్, బాసర్, కుంటాల, ముధోల్ మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాలకు భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తేవడం జరిగిందన్నారు. బాసరలో ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో బాసరకు రూ.50కోట్లు, అడెల్లి ఆలయ నిర్మాణానికి రూ.50కోట్లు మంజూరైతే అడెల్లి ఆలయాన్ని పునర్నిర్మించారని, బాసర నిధులు వెనక్కి పోయాయని, ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఉందో ప్రజలకు తెలుసన్నారు. రూ.42కోట్ల నిధులిచ్చి బాసర ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలియజేయడం హర్షించదగ్గ పరిణామమని తెలిపారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, నాయకులు సొలంకి భీమ్‌రావ్, వెంగల్‌రావ్, మోహన్‌రెడ్డి, సుమన్, ఆనంద్‌రావ్ పటేల్ పాల్గొన్నారు.

రోడ్లు ఊడుస్తూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెగ్యులర్ చేయాలని 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట రోడ్డును ఊడుస్తు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేయడంతో పాటు సమస్యలను పరిష్కారిస్తామని టీపీసీసీ హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించారని ఆరోపించారు. 15 రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నా పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చర్చలు జరిపి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియంక, రాజన్న, శ్రీకాంత్, బోజన్న పాల్గొన్నారు.

చిత్తగూడలో వైద్య శిబిరం



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని చిత్తగూడ ఆదివాసీ గ్రామంలో మంగళవారం ఐటిడిఎ ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని పిఓ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. వైద్య శిబిరంలో వివిధ స్పెషలిస్టు వైద్యులు మూడు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు బ్లాంకెట్లు స్వెటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, ఏజెన్సీ డీఎంహెచ్ఓ మనోహర్, గ్రామ పటేల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గడువులోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-కెరమెరి

జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వివరాలను సేకరించి ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి దరఖాస్తుదారుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఆదర్శ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, వంటగది, పరిసరాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రం పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రులలో నమోదు చేసుకొని సకాలంలో పొందవలసిన వైద్య పరీక్షలు, తీసుకోవలసిన పౌష్టిక ఆహారం, మందులపై అవగాహన కల్పించాలని తెలిపారు. శారీరక, మానసిక ఎదుగుదలలో లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి సకాలంలో పౌష్టిక ఆహారం, మందులు అందించి సాధారణ స్థితికి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. అంగన్వాడి సిబ్బంది మహిళలలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రం ఆవరణలో ఇసుక రాళ్ళు, మట్టి ఉందని పిల్లలు ఆడుతున్న



సరుకులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



అంగన్‌వాడీ కేంద్రంలో అదనపు కలెక్టర్

సమయంలో తింటున్నారని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సిమెంట్‌తో ఫ్లోరింగ్‌కు కృషి చేయాలని అంగన్వాడీ టీచర్ గుణసుందరి విన్నవించారు. అందుకు స్పందించిన అదనపు కలెక్టర్ ఐటిడిఏ డీఈని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీఓ అంజత్ పాషా, పంచాయతీ కార్యదర్శి గణేష్, ఏపిఓ మల్లయ్య, మున్ను, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెనూ ఏదీ...పాటించాల్సిందే..

మండలంలోని మోడీ కేజీబీవి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మెనూ ప్రకారం భోజనం పెడ్తున్నారా అంటూ బాలికల నుంచి మెనూ వివరాలు తెలిసుకున్నారు. పాఠశాల గోడపై ఉన్న మెనూ చార్ట్‌ను విద్యార్థినులతో చదివించారు. దాని ప్రకారం భోజనం పెడ్తున్నారా అని అడిగారు. మంగళవారం మెనూ చార్ట్‌లో ఉన్న దాని ప్రకారం భోజనం లేదని బాలికలు తెలిపారు. దీంతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం మెనూ పాటించాల్సిందేనని పేర్కొన్నారు.

రోజు వారి మెనూ అమలుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వంటకు తాజా కూరగాయలను, నాణ్యమైన సరుకులను వినియోగించాలన్నారు. వంట గదితో పాటు వంటకు వాడే పాత్రలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వసతిగృహంలోని తరగతి గదులు, స్నానపు గదులు, స్టోర్ రూంలను పరిశీలించారు.

కలెక్టర్ తనిఖీ సమయంలో పిఈటీ విజయలక్ష్మి మాత్రమే ఉన్నారు. మిగతా సిబ్బంది సమ్మెలో ఉన్నట్లు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, గ్రామస్తులు ఆత్రం లక్ష్మణ్‌రావు, కోవ ఇందిర పాల్గొన్నారు.

బహుజన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు పెరియార్

మంచిర్యాలలో పెరియార్ 51వ వర్ధంతి

నవతెలంగాణ-మంచిర్యాల

దేశంలోని బహుజన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన యోధుడుగా పెరియార్ రామస్వామి చరిత్రలో నిలిచిపోతాడని వివిధ బిసి బహుజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో పెరియార్ 51వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పెరియార్ చిత్రపటంపై పూలు చల్లి నివాళి అర్పించారు. నేటికీ వందేళ్ల క్రితమే బీసీలు, నిమ్న వర్గాలకూ అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని కోరిన గొప్ప సామాజిక శాస్త్రవేత్త పెరియార్ అని కొనియాడారు. మూఢ నమ్మకాలు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి ప్రజా పోరాటాన్ని నిర్మించినాడని తెలిపారు. శాస్త్రీయ సమాజం కోసం తన జీవితాంతం పోరాడిన ఉద్యమ జీవి అని పేర్కొన్నారు. పెరియార్ నడిపిన ఆత్మగౌరవ ఉద్యమం కారణంగానే తమిళ నాట బలహీనవర్గాలకు రాజ్యాధికారం దక్కిందని, అన్నాదురై, కరుణానిధి ముఖ్యమంత్రులు కాగలిగారని వారు పేర్కొన్నారు. తమిళనాడులో



అమలులో ఉన్న ద్రవిడ మోడల్ నేడు దేశానికి ఆదర్శమని వారు తెలిపారు.

సామాజిక సమానత్వమే పెరియార్ ఆశయమని, పెరియార్ అందించిన పోరాట స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానవ వికాస వేదిక జిల్లా అధ్యక్షులు మాడిశెట్టి సత్యసత్యనారాయణ, బీసీ ఐక్య వేదిక గౌరవ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి దేవి పోశం, బీసీ సబ్ ప్లాన్ సమితి నాయకులు మోతే రామదాసు, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు దేవి సత్యం, బహుజన ఐక్యవేదిక నాయకులు పలిగిరి కనకరాజు, మాడిశెట్టి విశ్వం, ఎడ్ల కిష్టయ్య, పురంశెట్టి శ్రీధర్, పొన్నగంటి యోసేపు, జెవిల్, కిరణ్, సురేష్ పలువురు బహుజన ఉద్యమకారులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించొద్దు

- ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు, పోలీస్‌స్టేషన్ తనిఖీ



నవతెలంగాణ-కెరమెరి

పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో స్టేషన్ అధికారులు వ్యహరించవద్దని ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం కెరమెరి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, కోర్టులో పెండింగ్ కేసులు, వాటికి సంబంధించిన దర్యాప్తు వివరాలను ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పరిశీంచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని కలిగించాలన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలని, ప్రజలకు పోలీసులపై ఉన్న నమ్మకానికి తగ్గట్లుగానే నిజాయితీతో పనిచేయాలని తెలిపారు. ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి స్టేషన్ పరిధిలోని గ్రామాలను కేటాయించడం జరిగిందని, నిత్యం గ్రామాలను సందర్శిస్తూ అక్కడ జరిగే ప్రతి కార్యక్రమం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వర్తించాలన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంస పత్రాలు, రివార్డులు అందజేస్తామన్నారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ కరుణాకర్, వాంకిడి సిఐ సత్యనారాయణ, ఎస్ఐ గుంపుల విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్ వేడుకలు...ముస్తాబైన చర్చీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏసు క్రీస్తు జన్మదినం క్రిస్మస్ వేడుకలకు ఆదిలాబాద్ పట్టణంలోని క్రైస్తవ ప్రార్థన మందిరాలు ముస్తాబయ్యాయి. ఈ నెల 25, 26 తేదీల్లో క్రిస్మస్ సంబరాలు జరగనుండగా అందుకోసం ఆయా చర్చిల్లో క్రైస్తవ మిషనరీలు భారీగా ఏర్పాట్లు చేశాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న క్రైస్తవ మందిరాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పలు చర్చీల్లో ఏసు జనన వృత్తాంతాన్ని వివరిస్తూ బొమ్మల కొలువులను అందంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ ప్రార్థనల కోసం చర్చీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏసు ప్రభువును స్వాగతిస్తూ చర్చీలు, ఇళ్ల ముందు నక్షత్ర దీపాలను ఏర్పాటు చేశారు. చర్చీల



ఆవరణలో రంగురంగుల విద్యుత్ దీపాలతో క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేయగా, సిరీస్ లైట్ల వెలుగులో సాయం కాలం వేల చర్చిలు కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. పండగ రోజున ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక్ చౌక్‌లోని రోమన్ క్యాథలిక్ చర్చితో పాటు రవీంద్రనగర్ సిఎస్ఐ చర్చిల్లో జరిగే ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పాఠశాలలో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు

ఇందులో భాగంగా పట్టణంలోని లిటిల్ స్టార్ పాఠశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు మేరీ తాత వేషధారణ వేయగా ఆకట్టుకున్నారు. బుధవారం సెలవు దినం కావడంతో పాఠశాలలో ముందస్తుగా ఈ వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కమలాకర్ పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ డెంటిస్ట్ డేను పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని కేఆర్కే కాలనీలోని వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు నోటి సంరక్షణపై అవగాహన కల్పించారు. వారికి బ్రష్, పేస్టులను ఉచితంగా అందించారు. సమాజ హితం కోసం దంత వైద్యులు ముందుకు రావడం పట్ల కార్యక్రమ అతిథులు అభినందనలు తెలిపారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుంటూ మరింత మంది సామాజిక సేవ కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ సమీయొద్దీన్, కార్యదర్శి డాక్టర్ రామకృష్ణరెడ్డి, కోశాధికారి డాక్టర్ రత్న డాక్టర్ ఆనంద్, డాక్టర్ భావన, డాక్టర్ నేహా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనరల్ హాలిడేస్‌లో సమగ్ర కుటుంబ సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఐదు(5) సీసీఎల్ మంజూరు చేయాలని తపస్ జిల్లా కార్యదర్శి వలబోజు గోపికృష్ణ కోరారు. మంగళవారం డీఈఓ ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. సెలవు దినాల్లో ఉపాధ్యాయులు సర్వే చేపడుతూ విధులు నిర్వహించారన్నారు. వీరికి సీసీఎల్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బందూకుల శ్రీనివాస్ ఉన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పర్యవేక్షించిన కలెక్టర్

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని నిరాల, సావాపూర్ గ్రామాల్లో మంగళవారం నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించి, దగ్గరుండి మొబైల్ యాప్ ద్వారా జిల్లా కలెక్టర్ రాజర్షిషా నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించి, తమ పేర్లను నమోదు చేయించుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరిది క్రమం తప్పకుండా సర్వే చేయాలని అధికారులకు సూచించారు. అతని వెంట ఎంపీడీఓ రాఘవేందర్‌రావు, ఎంపీఓ వెంకటరాజు ఉన్నారు.



కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జైనథ్

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలని, రాజకీయాలు ఎన్నికల సమయంలోనే మాత్రమేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 58 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఎవరి సహాయం లేకుండా భవిష్యత్తులో ఆడపిల్లల పెండ్లి చేసే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. అలా రావాలంటే ప్రభుత్వాలు అనేక విధాలుగా ప్రజలకు సహకారం అందించాలన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాలలో ప్రజా సమస్యలపై ప్రస్తావించడం జరిగిందని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు వెంటనే లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. లబ్ధిదారులు దళారులను నమ్మవద్దని సూచించారు. అలాంటిది ఉంటే తనకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కటకం రాందాస్, రమేష్‌రెడ్డి, ప్రతాప్, సంతోష్, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి పాల్గొన్నారు.

విినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



నవతెలంగాణ-నిర్మల్

వినియోగదారుల హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి వినియోగదారునికి హక్కులు, చట్టాలు, న్యాయపరమైన వివరాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. వినియోగదారుడు కొన్న ప్రతి వస్తువుకు రశీదును పొందడం తప్పనిసరి అని అన్నారు. వస్తువుకు క్వాలిటీతో పాటు క్వాంటిటీ సైతం ముఖ్యమేనన్నారు. ప్రజలు వస్తు సేవలను పొందునప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, వస్తు సేవల నాణ్యత లోపాలపై ప్రశ్నించే తత్వం అలవరుచుకోవాలని తెలిపారు. వ్యాపారస్తులంతా వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, రేషన్ డీలర్లు, వ్యాపారస్తులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని చాందూరి గ్రామపంచాయతీ పరిధిలోని నిలగొంది గ్రామంలో రూ.25లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నిర్మల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్మల్ జిల్లా నూతన కమిటీని మంగళవారం ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దాసరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెంట అశోక్, ఉపాధ్యక్షులుగా మనోహర్‌రెడ్డి, సుజాత, కోశాధికారిగా నాగయ్య, కార్యదర్శులుగా ఏ.రాజేశ్వర్, ఎస్‌కే ఫాసిల్, జి.రమేష్, పి.మురళి, ఏ.గంగాధర్, జాదవ్ రాజేందర్, గట్టు శ్రీనివాస్, శివరాణి, పత్రిక కన్వీనర్‌గా మారపాక భీమయ్య, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా చల్లా గోవర్దన్, గురుకుల కన్వీనర్‌గా ఎస్ అనిల్, అకాడమిక్ కన్వీనర్‌గా ఏ.లక్ష్మణ్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా అంబటి నారాయణ, సోషల్ మీడియా కన్వీనర్‌గా వీరేశం, క్రీడా కమిటీ వి.రాజేశ్వర్, స్టడీ సర్కిల్ యు.రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శులు ఏ.వెంకట్, సత్యానంద్, రమేష్ వ్యవహరించారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

- కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమిత్‌షా వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని దళిత నాయకున్ని రాజ్యాంగ నిర్మాతను గౌరవించని సంస్కృతి బీజేపీ నాయకులదని బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. ప్రపంచానికే ఆదర్శనీయులైన అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన మాటలు యావత్ జాతి ఖండిస్తుందన్నారు. ఇలాంటి వ్యక్తి హోంమంత్రి పదవిలో ఉండటం తగదన్నారు. వెంటనే ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కలెక్టరేట్ ఎదురుగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్ని కులాలు, మతాలు సమాన హక్కులతో ప్రజాస్వామ్యయుతంగా మనగగలుగుతున్నాయంటే అది బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే అని అన్నారు. అలాంటి మహనీయున్ని కించ పరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం అమిత్‌షాకు సిగ్గు చేటన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులతో పదవులను అనుభవిస్తున్న నాయకులు అది రాసిన వ్యక్తినే అవమానపరిచేలా వ్యాఖ్యలు చేయడం అహంకార పూరితమన్నారు. వెంటనే అలాంటి వ్యాఖ్యలు చేసిన హోంశాఖా మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, అలాగే ఎన్డీఏ ప్రభుత్వం అతనిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, తలమడుగు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ అల్లూరి అశోక్‌రెడ్డి, జైనథ్ శ్రీలక్ష్మి నారాయణ, స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డి రూకేష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, మావల ఎంపీపీ దర్శనాల ఏవన్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, ఆదిలాబాద్ అసెంబ్లీ ఎస్సీ వింగ్ సెక్రటరీ పవర్ వసంత్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, ఐఎన్టియూసీ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్ రావు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, సంద నర్సింగ్, గంద్రత్ రాజన్న రామ్ కుమార్, షేక్ ఇమ్రాన్, తూర్పుటి భూమన్న నాయకులు ఉన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళల కోసం అనేక చట్టాలున్న వాటి గురించి, అవగాహన లేక సాయం పొందలేక పోతున్నారని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళ సంఘాల సభ్యులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన చట్టం, గృహ హింస తదితర చట్టాల గురించి తెలియజేశారు. కేసుల నమోదు నుంచి న్యాయ సాయం ఎలా పొందాలో వివరించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ మహిళలు, బాలికల కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకువస్తున్నాయన్నారు. వాటి గురించి అవగాహన లేక న్యాయ సాయం పొందలేక పోతున్నారన్నారు. మహిళలకు చట్టాల గురించి తెలియజేయడంతో పాటు ధైర్యం నింపడానికి అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, పోక్సో కింద కేసులు నమోదు చెయొచ్చని తెలిపారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు పెండ్లిలు, పనుల్లో పెట్టుకోవడం నేరమన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా భరోసా కేంద్రాలు, సఖి సెంటర్లు పని చేస్తున్నాయని తెలిపారు. ఎలాంటి న్యాయ సాయం కావాలన్న డీఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా అందిస్తామన్నారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, మహిళ సాధికరత జిల్లా కోఆర్డినేటర్ పవార్ యశోద పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

2025 జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే తెలంగాణ సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి తొడసం శంబు తెలిపారు. సీపీఐ(ఎం) నిర్మల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగవారం ఇంటింటికి సీపీఐ(ఎం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ సీపీఐ(ఎం) పేదలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, సామాజిక న్యాయం కోసం అంకిత భావంతో ఉద్యమం చేస్తున్నట్టు వివరించారు. జనవరి 25 నుంచి నిర్వహించే మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. మహాసభల మొదటి రోజు జరిగే బహిరంగ సభలో ప్రకాష్ కారత్, కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం లాంటి ప్రముఖులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పోశెట్టి, ఫసిఉద్దీన్, నాయకులు ఉయిక భీమ్‌రావు, పంద్రం ఆనంద్‌రావు, సోయం సూర్యభాన్ పాల్గొన్నారు.

బ్యాంక్ పథకాలు విస్తృతం చేస్తాం

- డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన సంవత్సరం 2025లో రైతులకు మరింత చెరువయ్యేలా బ్యాంక్ పథకాలను విస్తృతం చేస్తామని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం బ్యాంక్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ తమ పాలకవర్గం వచ్చినప్పుడు రూ.800 కోట్ల బ్యాంక్ లావాదేవిలుండేదన్నారు. వచ్చిన తరువాత రూ.1525కోట్లతో కొనసాగుతుందని, మార్చి నాటికి 16 నుంచి రూ.17 వందల కోట్లకు తీసుకెళ్లేలా లక్ష్యం పెట్టుకున్నామన్నారు. రైతులు రుణాలు తీసుకొని సకాలంలో చెల్లిస్తే వడ్డీ కూడా తక్కువ పడుతోందన్నారు. బ్యాంక్ ద్వారా ఇండ్లు, వాహనాల రుణాలతో పాటు కొత్తగా రైతులకు కర్షక మిత్ర పథకం ద్వారా రుణాలు అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్ సిబ్బంది ఉన్నారు.

సకాలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలి

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంతో పాటు డొర్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్న తీరును మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్వే సకాలంలో నిర్వహించాలని సిబ్బందిని కోరారు. ఇంటింటికి వెళ్లి మొబైల్ యాప్ ద్వారా నమోదు చేస్తున్న వివారాలు సంబంధిత డాక్యుమెంట్లను సేకరించి మొబైల్ యాప్ ద్వారా అడుగుతున్న అన్ని కాలమ్స్ తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీఓ శేఖర్, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు నారాయణ, ఆసం రవి, శ్యామ్ సుందర్, ఎంపీడీఓ, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పలు కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రానికి చెందిన పండుగ చంద్రశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని పరామర్శించారు. అంతేకాకుండా కొప్పుల గంగాధర్ తండ్రి కొప్పుల లస్మన్న, డా.ఇస్లాముద్దీన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ పెంట రమణ, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సురేందర్, బాబులాల్, గులాబ్, సోమేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-నేరడిగొండ

సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ గ్రామానికి చెందిన ప్రకాష్‌కు రూ.55వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక చేయూత నందించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా బాధితులు ఎవరైనా ఉంటే తమ క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బజార్‌హత్నూర్ మండలాధ్యక్షుడు సామాన్‌పెల్లి శేఖర్, బోథ్ మాజీ ఎంపీటీసీలు కుర్మే మహేందర్, ఉమేష్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పోతారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు హిరాసింగ్, అజిమ్ నాయకులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అంజి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంజి గ్రామానికి చెందిన రాహుల్(22) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తాగుడుకు బానిసై మద్యం మత్తులో సోమవారం మధ్యాహ్నం తన ఇంట్లోనే పురుగులమందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడని తెలిపారు. పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కుచులాపూర్ శివారులో పెద్దపులి సంచారం




నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కుచులాపూర్ గ్రామశివారు ప్రాంతాలలో పెద్దపులి సంచరిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన రైతు ముక్కెర రమేష్ చేను నుంచి జక్కుల మోహన్ చేను వైపు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన దేవిదాస్ గమనించి చేనులో పనిచేస్తున్న వారిని అప్రమత్తం చేశారు. సెల్‌ఫోన్ ద్వారా గ్రామస్తులకు సమాచారం అందించి చుట్టుపక్కల చేనులో పనిచేస్తున్న వారికి సైతం పులి సమాచారం గూర్చి అప్రమత్తం చేశారు. గత ఐదు రోజుల నుంచి పులి సంచరిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. గత నెల రోజుల కింద అదే గ్రామానికి చెందిన రైతు ఆశన్న ఎద్దును చంపి తినగా అటవీ శాఖ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పులిని సీసీ కెమెరాలో బంధించారు. కుచులాపూర్ గ్రామస్తులతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు పులి సంచారంతో ప్రాణాలకే ముప్పు వస్తుందేమోనని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ, పులి నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

సమగ్ర కుటుంబ సర్వే నిధులు విడుదల చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాలుపంచుకున్న ఎనిమిరేటర్, సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్‌లకు వారి నిధులు తక్షణమే వారి అకౌంట్‌లో జమ చేయాలని మంగళవారం ఉట్నూర్ తహసీల్దార్‌ని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నవంబర్ నెలలో కుటుంబ సర్వే చేయడం జరిగిందని, వారికి తక్షణమే నిధులు విడుదల చేయాలని టీటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్ అన్నారు.

విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని అందుగులగూడ గ్రామానికి చెందిన బీఎడ్ విద్యార్థి వెంకటలక్ష్మి ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు మంగళవారం పరామర్శించారు. విద్యార్థి వెంకటలక్ష్మి పెద్దకర్మకు హాజరై, కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. పరామర్శించిన వారిలో బెజ్జూర్ మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, బీజేపీ నాయకులు మెస్రం రాజారాం, దహెగాం పాపయ్య, సామల తిరుపతి, భిక్షపతి, ఉమ్మెర బాలకృష్ణ, మాజీ సర్పంచ్ అల్లూరి మోహన్, గూడ రాకేష్, కొప్పుల దిలీప్, అల్లూరి రామయ్య ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కెరమెరి జట్టు ఎంపిక

నవతెలంగాణ-కెరమెరి



ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో కెరమెరి జట్టు ఎంపికైనట్టు ఎంపీడీఓ అంజత్ పాషా అన్నారు. మండలానికి చెందిన కబడ్డీ జట్టు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. దీంతో జట్టు సభ్యులను ఎంపీడీఓ అంజ త్ పాషా అభినందించారు. త్వరలో జనగాం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి మండలానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. అనంతరం జట్టు సభ్యులను ఎంపీడీఓ అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ ప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య మున్ను, శంకర్ పాల్గొన్నారు.

రామస్వామి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

- బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్



నవతెలంగాణ-వాంకిడి

సంఘ సంస్కర్త, సామాజిక వేత్త రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాలను పాటించే దక్షిణ భారత అంబేద్కర్ పెరియార్ రామస్వామి 145వ వర్ధంతిని మండలకేంద్రంలోని జై పవన్ బుద్ధవిహార్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ మాట్లాడుతూ రామస్వామి వర్తమాన సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయుడన్నారు. ఆనాడు అంటరాని తనం ఉన్న సమయంలో పెరియార్ రామస్వామి తన ప్రాణాలకు తెగించి రూపుమాపడానికి పోరాటం చేశారన్నారు. అనంతరం దుర్గం శ్యామ్‌రావు పంచశీల్ వందనం చేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు ఉప్రే జైరాం, అంబేద్కర్ సంఘం సమాజ అధ్యక్షుడు కోబ్రగడే విలాస్, మహాత్మా రాజేంద్రప్రసాద్, నాయకులు ఉప్రే రోషన్, రాంటెంకి ప్రతాప్, జైపాల్, ఉప్రే చింటూ, కోబ్రగడే సురేష్, దుర్గం మెనూ, వివేక్, జాడే ప్రదీప్, కోత్రాగడే తిరుపతి, జాడే రమేష్, చినార్కర్ రమేష్ పాల్గొన్నారు.

27న జీఎం ఆఫీసు ముట్టడి



నవతెలంగాణ-రెబ్బెన

పది సంవత్సరాల నుండి కనీస వేతనాల జీఓలు, జీతాలు పెరుగక చేసిన ఒప్పందం అమలు గాక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, కార్మికుల సమస్యల పరిష్కరం కోసం ఈనెల 27న జీఎం కార్యాలయ ముట్టడిస్తున్నామని టీబీజీకేస్ అనుబంధ సంస్థ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఏ.ఓదేలు అన్నారు. మంగళవారం గోలేటిలోని సివిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు సింగరేణి ఆవిర్భావ దినం రోజైనా జీతాల పెరుగుదలపై ప్రకటన చేస్తారని ఎంతో ఆశతో ఎదురుచూసిన కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. అధికారానికి వచ్చిన నెల రోజుల్లో జీతాలు పెంచుతామని కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రకటనలకే పరిమితమైందన్నారు. హక్కులు అడుక్కుంటే రావని పోరాడి సాధించుకోవాల్సిందేనన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 27న గోలేటి జీఎం ఆఫీస్ ముట్టడికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-కెరమెరి

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి మండలానికి గుర్తింపు తీసుకురావాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షులు సయ్యద్ అబుల్ కలాం అన్నారు. మంగళవారం అయన నివాసంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడంతో కబడ్డీ జట్టు సభ్యులను అభినందించారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు రాకపోకల ఖర్చుల నిమిత్తం రూ.5000 ప్రోత్సాహకం అందించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడల్లో చక్కటి క్రీడా నైపుణాన్ని ప్రదర్శించి మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పేందూర్ మోతిరామ్, క్రీడకారులు పాల్గొన్నారు.

క్రిస్మస్ పండుగకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించే క్రిస్మస్ పండుగకు ఏర్పాట్లు పూర్తయినట్టు పాస్టర్ ప్రభాకర్ తెలిపారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని క్రిస్టమస్ పండుగను విజయవంతం చేయాలని కోరారు.

ఓపెన్ ఎస్ఎస్‌సీ స్పెషల్ అడ్మిషన్ తేదీల పొడిగింపు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గుండాయిపెట్ జడ్పీటీసీ పాఠశాలలో ఓపెన్ 10వ తరగతి స్పెషల్ ప్రవేశ తేదీలను ఈ నెల 24 నుండి 30 వరకు పొడగించినట్టు ప్రధానోపాధ్యాయులు గొడాం నానాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఓపెక్ 10వ తరగతి చదవాలను కునేవారు ఈ నెల30 వరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9494029826, 9849823929 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామ సమీపంలో గల తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా సందర్శించి వంటశాల, ఆహార సామాగ్రి నాణ్యత, మధ్యాహ్న భోజనం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పెంచిన డైట్ చార్జీల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని, వంట సమయంలో తాజా కూరగాయలు, నాణ్యత గల సరుకులను వినియోగించాలని, కాలం చెల్లిన వస్తువులను ఉపయోగిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు 40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచిందని, ప్రతి పాఠశాల, వసతి గృహంలో నూతన మెనూ పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందించాలని, మూత్రశాలలు, సౌచాలయాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. గురుకుల పాఠశాల అద్దె భవనంలో ఉన్నందున పూర్తిస్థాయి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాలను పరీక్షించారు. చలికాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థినుల గైర్హాజరు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి కేటాయించిన భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, గురుకుల ప్రిన్సిపాల్స్, గిర్దవార్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజి లేక..రోడ్లపైకి మురుగు నీరు



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని పలు తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామ పంచాయతీల్లో పారి శుధ్యం లోపించింది. డ్రైనేజి కాలువలు నిర్మాణం చేపట్టక పోవడంతో ఇండ్ల చుట్టూ మురుగు నీరు పారుతుండడంతో వీధుల్లో అపరిశుభ్రత నెలకొంది. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా చిన్న గ్రామాలను సైతం గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత కోసం మల్టీ పర్పస్ వర్కర్స్‌ను నియమించింది. జనాభా ఆధారంగా పంచాయతీలకు ప్రతి నెల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశారు. అయిన సరిహద్దు గ్రామాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో పలు గ్రామాల్లో పారి శుధ్యం పడకేసింది. మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్తులు స్నానాలు చేసిన నీళ్ల, వంట పత్రాలు శుభ్ర పర్చిన నీరు, బట్టలు పిండిన నీళ్ల ఇలా ఇండ్ల చుట్టూ చేరి దుర్గంధం వెదజల్లుతుంది. కొన్ని గ్రామాల్లో రోడ్లపై మురుగు నీరు పారుతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గ్రామాల్లోకి పరిశుభ్రతను ప్రత్యేకధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోక పోగా ఇలా ప్రజలకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు. వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరిహద్దు గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత కోసం చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంటులో అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ పేరుతో చేపట్టిన నిరసనలో భాగంగా అంబేద్కర్ చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లిన నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ స్ఫూర్తి ప్రధాత అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ విచ్ఛిన్నతకు బీజేపీ కుట్రలు పన్నుతోందన్నారు. సమాజంలోని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్‌ను అవమానించడం భారత ప్రజానీకం మొత్తాన్ని అవమానించినట్లేనని అన్నారు. వెంటనే అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ పార్టీ ఆయనను బర్తరఫ్ చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు గుండ శ్యామ్, జైనూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథ్, మాజీ జడ్పీటీసీ సంతోష్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, జిల్లా నాయకులు అనిల్ గౌడ్, కనక ప్రతిభ, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

గిరిజనులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు
- కుట్టు మిషన్ల పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గిరిజనుల అభివృద్ధికి పోలీసులు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అన్నారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో పోలీసులు మీకోసంలో భాగంగా 35 మంది గిరిజన మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆర్థిక అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా కృషి చేయాలన్నారు. విద్య అభివృద్ధి చెందినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మహిళల స్వశక్తి అభివృద్ధి కోసం కుట్టుమిషన్లు పనిచేస్తాయని పేర్కొన్నారు. వీటి పంపిణీ కోసం సహకారం అందించిన చేతన ఫౌండేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డిఎస్పీ కరుణాకర్, సీఐ రమేష్, ఎస్సై సాగర్, చేతన ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పోరుగడ్డను సందర్శించిన మధ్యప్రదేశ్ బృందం



నవతెలంగాణ-కెరమెరి

పోరుగడ్డ ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్ గ్రామాన్ని మంగళవారం మధ్యప్రదేశ్‌కు చెందిన ఆదివాసీ బృందం సభ్యులు సందర్శించారు. ముందుగా భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి సంప్రాదాయ పూజలు నిర్వహించారు. సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మ్యూజియంలో కలియతిరిగారు. సంగ్రాలయంలో ఏర్పాటు చేసిన భీం అనుచరుల ప్రతిమలు, ఆదివాసీ గిరిజనుల సాంస్కృతిక, సంప్రాదాయాలను ప్రతిభింభించే విధంగా ఏర్పాటు చేసిన నమూన చిత్రాలను తిలకరించారు. వ్యవసాయంలో వినియోగించే పనుముట్లను పరిశీలించారు. పండించే పంటలు, ఆహారపు అలవాట్లు జీవన విధానం, నిజాం ప్రభుత్వంతో పోరాడిన తీరుతెన్నుల వివరాలను భీం మనుమడు సోనేరావును అడిగి తెల్సుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ పెందూర్ రాజేశ్వర్, ఆనందరావు, మ్యూజియం క్యూరేటర్ దుందేరావు, గంగు సిబ్బంది, మధ్య ప్రదేశ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

కోళ్ల ఫామ్ నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చిచ్చుపల్లి గ్రామ పంచాయతీలో ఐకేపీ ద్వారా మంజూరు చేసిన 1000 కోడి పిల్లల పెంపకానికి ఉపాధి హామీ నిధులతో కోళ్ల ఫామ్ నిర్మాణానికి ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగితేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, ఇందులో భాగంగానే వెయ్యి కోడి పిల్లల పెంపకానికి అనుగుణంగా షెడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం దాబా, సవాతీ, దొడ్డిగూడ, చిచ్చుపల్లి, నవేదరి గ్రామపంచాయతీలలో చేపడుతున్న నర్సరీ పనులను, ఇందిరమ్మ గృహాల మంజురు కోసం పంచాయతీ కార్యదర్శులతో ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా చేపడుతున్న సర్వే వివరాలను పరిశీలించి సర్వే త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ శ్రావణ్ కుమార్, సంబంధిత గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యులు శ్రీనివాస్, స్థానిక యువకుడు మెరుగు సిద్దుగౌడ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. అనంతరం ఆపరేషన్లు అవసరమున్న వారిని గుర్తించి త్వరలోనే కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. మిగతా వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ గౌడ్, రాపర్తి ధనుంజయ, కమలాకర్, గందె వెంకటేష్, నాగేష్ గౌడ్ పాల్గొన్నారు.

డిజిటల్ విధానం ద్వారా వినియోగదారులకు న్యాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారులకు సమగ్ర న్యాయం జరిగేందుకు ఆస్కారం ఉంటుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బాబా వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో టీఎస్‌సీఎస్‌సీఎల్‌డీఎం నరసింహారావు, ఆర్డీఓ లోకేశ్వరరావు, మెడికల్ అధికారి వినోద్ కుమార్, సహకార తూనికల కొలతల శాఖ అధికారి సుందర్ రావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల హక్కుల సంస్థ అధ్యక్షుడు కిరణ్ కుమార్‌తో కలిసి ఎల్‌పీజీ, పెట్రోల్ బంక్ డీలర్లు, వినియోగదారులకు డిజిటల్ విధానం, వర్చువల్ విచారణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు డిజిటల్ విధానం-వర్చువల్ విచారణ ద్వారా సమగ్ర న్యాయం పొందవచ్చుని, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సాంకేతికత ఆవశ్యకత, గ్రామీణ ప్రాంతాలు, సంబంధిత అంశాలకు మరింత అందుబాటులో ఉండేలా చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. వినియోగదారుల కోసం వర్చువల్ విచారణలు, ఆన్‌లైన్ ఫిర్యాదు దాఖలు, డిజిటల్ వనరుల ప్రయోజనాలు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. వినియోగదారులకు సమగ్ర న్యాయం జరిగేలా డిజిటల్ యాక్సెస్ ను నిర్ధారించడంలో ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | డిసెంబర్ 25, 2024 | www.navatelangana.com

ఫుట్‌బాల్ జట్టుకి జెర్సీలు అందజేత

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని సోమగూడెంలోని శిశు మందిర్ క్రీడా మైదానంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్ ఆధ్వర్యంలో మండల ఫుట్ బాల్ జట్టుకు జెర్సీలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వేముల కృష్ణ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడం చాలా మంచి విషయమని, ఇలాగే ప్రోత్సహిస్తూ ఉండాలని, అలాగే యువత చెడు అలవాట్లకు వెళ్లకుండా క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫుట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మందమర్రి



కేకే ఓసీలో విధులు నిర్వహిస్తున్న క్లర్క్ రవీందర్ అనే ఉద్యోగిపై ఈపీ ఆపరేటర్ నూనె సాంబయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలపై సింగరేణి క్లర్క్ అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం కెకె ఓసీ వద్ద క్లర్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఈపీ ఆపరేటర్‌పై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఓసీ మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టి.ఉపేందర్, కె.రమేష్, కె.శ్రీనివాస్, జె.శ్రీధర్, నాగరాజు, రవీందర్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



నవతెలంగాణ-తాండూర్

విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి మండలంలో రూ.కోటితో నిర్మించిన ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ నూతన భవన ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గురుకుల విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మెనూ చార్జీలు పెంచిందని తెలిపారు. దశలవారీగా గురుకులాలకు నూతన భవనాలను సమకూర్చే యోజనలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నతమైన జీవిత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలో మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతా, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్, యువ నాయకులు స్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమయ్యేవరకు ఒత్తిడి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికులకు సొంతింటి కల సహకారమయ్యేంతవరకు యాజమాన్యం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలపై ఒత్తిడి చేస్తూనే ఉంటామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. మంగళవారం ఆర్కె 5గనిలో ఫిట్ సెక్రటరీ చిగురు లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు అనుకోని కారణం చేత మూడు నాలుగు రోజులు డ్యూటీకి గైర్హాజరైతే వారిని మెడికల్ చెక్ అప్‌కు పంపి ఇబ్బందులు గురి చేస్తున్నారని, అలాగే బీపీ షుగర్ పేరుతో మరో రెండు రోజులు ఆస్పత్రుల చుట్టూ తిప్పించుకుంటున్నారని, దీంతో కార్మికుల ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అంతేకాకుండా పేర్ల మార్పిడిపై జరిగిన ఒప్పందం దిశగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్యంతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రూ.33 వేల కోట్ల పైచిలుకు బకాయిలను వెంటనే విడుదల చేసే విధంగా అసెంబ్లీలో ప్రకటన చేయాలని, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నందున కోల్ బెల్ట్ ప్రాంత ఎంపీలు పార్లమెంట్‌లో కూడా సింగరేణికి రావాల్సిన బకాయిలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, ఎన్నో రోజులుగా సొంతింటి కల అలవెన్స్‌లపై ఐటీ మాఫీ, మారుపేరుల, సీబీఎస్సీ సిలబస్ అంశాలపై సీఐటీయూ కల్పించిన అవగాహనతో ఎన్నికలలో అన్ని యూనియన్లు ఈ అంశాలపై మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందని, అవి అమలయ్యేంతవరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగల శ్రీనివాస్, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, వెంకట్ రెడ్డి, పెరుక సదానందం, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ బట్టు సురేందర్, ఇప్ప నరేష్, శ్రీనివాస్, పోతు వెంకటేష్ పాల్గొన్నారు.

రేచీని మీదుగా ఆర్టీసీ బస్సు పునరుద్ధరించండి



నవతెలంగాణ-తాండూర్

రెబ్బెన, నార్లాపూర్ మీదుగా ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కాంగ్రెస్ నాయకులు ఆనంద్ కోరారు. మంగళవారం రేచినికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించి సమస్యలను విన్నవించారు. ఆర్టీసీ బస్సు లేక బెల్లంపల్లి జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయివేట్ వాహనాలలో భారీ మొత్తంలో రవాణ ఖర్చులు అవుతున్నాయని పేర్కొన్నారు. రేచీని గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు మహాలక్ష్మి పథకానికి దూరం అవుతున్నారని తెలిపారు. రేచీని మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తే తాండూర్, గోపాలనగర్, రెచిని, కొముురవెల్లి, నార్లాపూర్, నంబాల, రెబ్బెన గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో భామనపల్లి ఆనంద్, సోమయ్య వెంకన్న గౌడ్, భాస్కర్ గౌడ్, శీను, వేమునూర్ కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

తుడుం దెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా దుబ్బ రాజం



నవతెలంగాణ-జన్నారం

తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా మండలంలోని సింగరాయపేట గ్రామానికి చెందిన ఆరే దుబ్బరాజం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా ఏటూరునాగారంలో తుడుం దెబ్బ తొమ్మిదవ రాష్ట్ర మహాసభ సందర్భంగా జాతీయ కన్వీనర్ రామన్నల లక్ష్మణ్ నియామక పత్రాన్ని అందించినట్టు దుబ్బ రాజం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తుడుం దెబ్బను మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తామన్నారు. తనకు సాంస్కృతిక కార్యదర్శిగా నియమించినందుకు తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టెం ఉపేందర్ జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బ రాజంను మండల తుడుం దెబ్బ నాయకులు బైనేని కొమురయ్య, మోతె రమేష్, మోతే నరసయ్య, సేదం చిన్నయ్య అభినందించారు.

అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

- బీజేపీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ





నవతెలంగాణ-లక్సెట్టిపేట

కేంద్ర హోం శాఖ మంత్రిని అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయడంతో పాటు బీజేపీ భారతదేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం లక్సెట్టిపేట పట్టణంలో టీపీసీసీ అధ్యక్షుడి పిలుపు మేరకు అమిత షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. కాగా ఈ నిరసన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ దేశ ప్రజలు బీజేపీకి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారన్నారు. బీజేపీ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేకమైన పార్టీ అని దానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తోగరు రాజు, రవీందర్ మినుముల శాంతి కుమార్, పెండెం రాజు, వేల్పుల ప్రేమ్ సాగర్, పెండం సత్తన్న, కుమార్ పాల్గొన్నారు.

మందమర్రి : కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ మంగళవారం మందమర్రిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని, ఇవి అంబేద్కర్ చూపిన మార్గాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. అంబేద్కర్ కల్పించిన ప్రజాస్వామ్య, సమానత్వం, న్యాయం వంటి విలువల కోసం తాము పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇంధన్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రెజ్లింగ్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. కలెక్టర్ కుమార్ దీపక్ చేతల మీదుగా గోల్డ్ మెడల్స్ అందుకున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీ.రాజేందర్, పీటీ తిరుపతి తెలిపారు. ఇంధన్‌పల్లికి చెందిన విద్యార్థులు కె.దీప్తి, ఎం.సంజన 10వ తరగతి చదువుతున్నారు. జిల్లా స్థాయిలో రెజ్లింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇదే స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం, పీటీతో పాటు తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీఓ శశికళ, గ్రామ కార్యదర్శి చంద్రమౌళి అభినందనలు తెలిపారు.

కల్వరీ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు సిద్ధం

నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి, సోమగూడెం రహదారి మధ్యలోని కల్వరీ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం నిర్వహించే క్రిస్టమస్ వేడుకల కోసం చర్చిని అందంగా అలంకరించారు. చర్చిని దీపాలంకరణ చేసి ముస్తాబు చేశారు. ఈ ప్రాంతంలో అతి పెద్ద చర్చి కల్వరీ కావడంతో అధిక సంఖ్యలో క్రైస్తవులు తరలిరానున్నారు. దీంతో పాటు సోమగూడెం, కాసిపేట, దేవాపూర్ తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్టమస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కార్మికుల సమస్యలపై 24 గంటల దీక్ష



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఎదుట మంగళవారం కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఓరియంట్ గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షులు రాములు నాయక్ 24 గంటల దీక్షను చేపట్టారు. సీకే బిర్లా యాజమాన్యం ఆదాని గ్రూపులకు అమ్మకం చేస్తున్న క్రమంలో ఉద్యోగులకు భద్రత కల్పించాలని, నాలుగో ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, తదితర డిమాండ్లపై దీక్షను చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తట్ర భీంరావు, శ్రీనివాస్, సారా రాజయ్య, సామ సనత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మడావి గంగారాం, సర్వేశం, భూమన్న, శంకర్, జైపాల్, కొమ్ముల బాపు, సామ రాజారెడ్డి పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేచీని గంపలపల్లి మధ్య గల రెండున్నర కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.మూడు కోట్లు సీఎస్ఆర్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అదే గ్రామంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. తాండూర్ గ్రామంలోని మహాలక్ష్మి కాలనీలో రూ.ఐదు లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామపంచాయతీలలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు వినియోగిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రవికుమార్, ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, సీనియర్ పార్టీ నాయకులు సూరం రవీందర్ రెడ్డి, మురళీధర్ రావు, మహేందర్ రావు, ఎండీ ఈసా, సాలిగామా బాణయ్య, పేరం శ్రీనివాస్, సుభాష్, యువ నాయకులు గాంధీ పాల్గొన్నారు.

తాండూర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం

ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా తాండూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరం కనిపించింది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎమ్మెల్యే దృష్టిని ఆకర్షించడానికి స్థానిక నాయకులు ప్రయత్నించారు. ఎమ్మెల్యే సహచర బృందానికి తేనీటి విందు భోజనాలనే ఏర్పాటు చేసి తమ సంఖ్యాబలాన్ని నిరూపించుకున్నారు. తాండూర్ మేజర్ గ్రామపంచాయతీలో పటిష్టమైన నాయకుడిని బరిలో ఉంచాలని ఎమ్మెల్యే యోచిస్తున్నారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ మహేందర్ రావు కుమారుడు గాంధీ ఇచ్చిన విందు కార్యక్రమం అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలపై ఎమ్మెల్యే చర్చించారు. తాండూరు మండలంలోని ఎంపీటీసీ సర్పంచ్ స్థానాలకు అధికార పార్టీ నుండి ఇద్దరు కంటే ఎక్కువ మంది కాంగ్రెస్ కార్యకర్తలు టికెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్ అవకాశం కల్పిస్తే తాండూర్ గ్రామపంచాయతీ నుండి మహేందర్ రావు కుమారుడు గాంధీ బరిలో నిలిచే అవకాశాలున్నాయి.

అర్హులైన జర్నలిస్టులకు స్థలాలిచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

అర్హులైన జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని టీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు డేగ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల హక్కుల కోసం టీయూడబ్ల్యూజే పోరాటం చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కలిగిన వారికి హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు బెనిఫిట్స్ కోసం, ఈ సంఘం పనిచేస్తుందన్నారు. జర్నలిస్టులంతా టీయూడబ్ల్యూజే సంఘంలో సభ్యత్వాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్‌రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చిలువేరు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న, జర్నలిస్టులు మల్లేశం, కిరణ్, సత్యనారాయణ, సతీష్, వెంకటయ్య, శేఖర్ పవన్, సత్యం, చారి నర్సయ్య రాజు, వేణు, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చైనా మాంజాలు వాడొద్దు

నవతెలంగాణ-జన్నారం



పండగలకు చైనా మాంజాలు గాలిపటాలు వాడొద్దని అటవీ డివిజన్ డీఆర్ఓ తిరుపతి అన్నారు. మంగళవారం మండలంలోని పలు కిరాణా దుకాణాలలో తనిఖీలు చేశారు. చైనా మాంజాలు అమ్మడం వల్ల పిచ్చుకలు, పక్షులు వాటికి తాకి ప్రాణాలు కోల్పోతున్నాయని అన్నారు. చైనా మాంజాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ శ్రీనివాస్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశ దరఖాస్తులు



నవతెలంగాణ-జైపూర్

ఓపెన్ స్కూల్ ద్వారా విద్యాభ్యాసం కొనసాగించాలనుకున్న వారి నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల కేంద్రంలో గల ఓపెన్ స్కూల్ నిర్వాహకులు జంబోజు సత్తయ్య తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువాలనుకున్న వారు నేరుగా ఓపెన్ స్కూల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 30 వరకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నామని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు కాలేజీకి వెళ్లకుండా ఇంటర్ పూర్తి చేసుకునేందుకు వీలుగా సెలవు దినాల్లో తరగతు నిర్వహించబడతాయని, 10వ తరగతి ప్రవేశం కోసం జన్మదినం తెలిపేందుకు టీసీ అవసరం లేకుండా కేవలం రెవెన్యూ అధికారులు ధృవీకరిస్తూ ఇచ్చిన పుట్టిన తేదిని పరిగణలోకి తీసుకుంటామన్నారు. కారణాలు ఏవైనా విద్యాభ్యాసం మధ్యలో ఆగిపోయి విద్యాభ్యాసం కొనసాగించాలన్న ఆసక్తి కలిగిన వారు నేరుగా ఓపన్ స్కూల్ ద్వార విద్యాభ్యాసం కొనసాగించడానికి ప్రభుత్వం అవకాశముందన్నారు.ఓపన్ స్కూల్‌లో చదివిన వారు కూడా ఆశించిన విద్యార్హతలు సాదించి పోటీ పరిక్షలకు హాజరు కావడంతో పాటు ఉద్యోగాలు సాదించడానికి అవకాశం ఉంటుందన్నారు. వివరాల కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఓపన్ స్కూల్ నిర్వాహకులను సంప్రదించాలన్నారు.

గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రోటిగూడ గ్రామంలో 2019లో ఏర్పాటు చేసిన రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఐదు సంవత్సరాల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తు గల్ఫ్ కార్మికులకు అండగా నిలిచిందని ఆ గ్రామ వ్యవస్థాపక అధ్యక్షులు సేపూరి గోపాల్ అన్నారు. మంగళవారం గ్రామ గల్ఫ్ సంక్షేమ సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పు మల్లేష్, ఉపాధ్యక్షుడిగా ఉప్పు తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ సమితి పని చేస్తుందన్నారు. గల్ఫ్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు పాలాజీ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు పులిశెట్టి నాగేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 25, 2024 | www.navatelangana.com

దీక్ష ఎవరి ప్రయోజనాల కోసం

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-కాసిపేట

మాజీ ఎమ్మెల్సీ, ఓరియంట్ లోకల్ యూనియన్ అధ్యక్షులు ఎస్.రాములు నాయక్ మంగళవారం దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద చేపట్టిన 24 గంటల దీక్షకు సీపీఐ(ఎం) పూర్తి మద్దతు తెలియజేస్తుందని, కానీ ఈ దీక్ష ఎవరి ప్రయోజనం కోసమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు నుంచి ఈ రోజు వరకు యాజమాన్యం ఇచ్చిన హామీలు ఎందుకు అమలు జరగలేదో, దీనికి కారణం ఎవరో రాములు నాయక్ స్పష్టం చేయాలని కోరారు. ఓరియంట్ కంపెనీ నేడు బిర్లా యాజమాన్యం నుంచి అదానీ కంపెనీగా మారబోతోందంటే గత బీఆర్ఎస్, ప్రస్తుత బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రభుత్వాల అనుమతి లేకుండానే ఈ తతంగం జరుగుతుందా అని పేర్కొన్నారు. వీటిపై కాసిపేట మండల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన కనీస బాధ్యత బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల నాయకులకు ఉందని తెలిపారు. లేదంటే కొంగ జపం, మొసలి కన్నీరు దీక్షలాగానే మిగిలిపోతాయని ఎద్దేవా చేశారు.

టీఎన్జీఓ సంఘ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో మంగళవారం టీఎన్జీఓ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు సభ్యత్వం ఇచ్చారు. టీఎన్జీఓలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఉద్యోగికి ఈ సంఘం అండగా నిలుస్తుందని శ్రావణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధ్యక్షులు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి నరేందర్, మండల అధ్యక్షులు లకావత్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మధు కుమార్, క్యాషియర్ విశ్వశ్రీ, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ బస్టాండ్ ఎదురుగా రోడ్డుపైన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారి చెక్ పోస్టు నుండి దాదా నగర్ చౌరస్తా వరకు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అతివేగంగా వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఈ మధ్యనే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయాని తెలిపారు. ప్రమాదాలు రోజు జరుగుతున్నాయని ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముంజం ఆటో కార్మికులు మహమ్మద్ రఫీక్, గణేష్, అబ్దుల్ రహీం, ఇన్నోస్, మహమ్మద్, సలీం పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంల వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఆశ్రమ పాఠశాలల ఏఎన్ఎంల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నెలల నుండి వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఉండడానికి అవసరమైన సదుపాయం లేకపోయినప్పటికీ స్థానికంగా అందుబాటులో ఉంటున్నారన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండే సేవ చేస్తున్న వీరికి వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ భద్రత లేకున్నా సేవ చేస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు మడవి మహేశ్వరి, శ్రీదేవి, హిరబాయి, చాందిని, పూలబాయి, మారుబాయి, సుజాత, కనిబాయి, పోసుబాయి, సుజాత పాల్గొన్నారు.

మూగజీవాలను పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-రెబ్బెన

అక్రమంగా తరలిస్తున్న మూడజీవాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సమాచారం మేరకు రెబ్బెనలో ఎన్‌హెచ్-363పై వాహనాలు తనిఖీ చేస్తున్నారు. షేక్ షబ్బీర్, షేక్ అఫ్తాబ్ ఎటువంటి ఆధారాలు లేకుండా గడ్చందూర్ మహారాష్ట్ర నుండి హైదరాబాద్‌కి తమ బొలెరో వాహనంలో 7 ఎద్దులు, 3 ఆవులు మొత్తం 10 మూగ జీవులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

దేవాజిగూడను జెండాగూడలో కలపొద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దహెగాం మండలంలోని బీబ్రా గ్రామపంచాయతీలో గల దేవాజీగూడను నూతనంగా ప్రతిపాదిస్తున్న జెండాగూడ గ్రామపంచాయతీలో కలపకూడదని ఆ గ్రామస్తులు కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాజిగూడ ఆవిర్భావం నుండి బిబ్రా గ్రామపంచాయతీలోనే కొనసాగుతుందని, ప్రస్తుతం నూతన గ్రామపంచాయతీ జెండాగూడ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు తమను ఆ పంచాయతీలో కలపడం దారుణమన్నారు. తాము నూతన పంచాయతీలో కలవడానికి సిద్ధంగా లేమని తమ ఆమోదం లేకుండా అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ప్రస్తుతం ఉన్న విధంగానే తమ గ్రామాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు దాసరి సత్తయ్య, దేవయ్య, సాయి కుమార్, తిరుపతి, రామయ్య పాల్గొన్నారు.

ఘనంగా పంచాశత్ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయంలో ఆలయ పూజారి అంబేద శంకరయ్య సంతోష్ ఆధ్వర్యంలో పంచాశత్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకత పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం భద్రకాళితో అగ్ని గుండం ప్రవేశం చేసి పూర్ణహుతి ఆశీర్వచనం చేసి అనంతరం భక్తులకు అగ్ని గుండం ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి శివ పార్వతులను దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాటూరి మల్లేష్ మాతృమూర్తి గత కొద్దిరోజుల కింద మృతి చెందగా వారి కుటుంబాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, మల్లేష్, రమాకాంత్, నిమ్మల సుదర్శన్‌రెడ్డి, గంగారాం, శ్రీనివాసరెడ్డి, కిరణ్, అంగూర్, గజానన్, నాగారెడ్డి, నర్సింలు ఉన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో బీజేఎల్పీ నాయకుడు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, ముత్యంరెడ్డి, సరికెల గంగన్న, వీరేశ్, సత్యం, చంద్రకాంత్, సృజన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పిల్లలు, మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీ గ్రామాలలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం క్రింద మంజూరైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, మూత్రశాలల నిర్మాణం, భవనాలకు రంగులు, పిల్లలకు ఆట వస్తువులు సమకూర్చడం వంటి పనులను వెంటనే చేపట్టాలని తెలిపారు. భవనాల మరమ్మత్తు పనులకు అవసరమైన ప్రతిపాదనలను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేసి అనుమతులు పొందాలని సూచించారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, సీడీపీఓలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల భిక్షాటన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించి తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్ష 15వ రోజులో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేశారు. వివిధ పనుల నిమిత్తం వేర్వేరు ప్రాంతాల నుండి కలెక్టరేట్‌కు వచ్చిన వారి నుండి భిక్షాటన చేశారు. సమగ్ర శిక్ష సమ్మెకు మద్దతుగా తెలంగాణ ప్రయివేట్ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పెద్దపల్లి కిషన్ రావ్, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, కార్యవర్గ సభ్యులు పాల్గొని సంఘీభావంగా రూ.15000 విరాళంగా అందించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శృతిక, పవార్ తుకారాంలు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా సమ్మెను నివారించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమ సర్వీసును వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, పే స్కేలు వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ఉపాధ్యక్షురాలు ఇందారపు నాగసుధ, జిల్లా కోశాధికారి బోయిని నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ పాల్గొన్నారు.

జ్యోతిష్యం చెప్పి వినూత్న నిరసన

నిర్మల్‌టౌన్ : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు మంగళవారం వినూత్న రీతిలో ఓ స్వామిజీతో సమ్మక్క సారలమ్మ జ్యోతిష్యం చెప్పించుకున్నారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించడంలేదని మండిపడ్డారు. గత కొన్ని రోజులుగా ఉద్యోగులు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా సోషల్ స్టడీస్ విభాగం ఫోరం ప్రెసిడెంట్ అశోక్ కుమార్, ఆంజనేయులు, తెలంగాణ జేఏసీ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా యూత్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పీఆర్టీయూటీఎస్ అధ్యక్షకార్యదర్శులు నరేంద్రబాబు, రమణరావు, గజ్జరాం, అరవింద్, దత్తాత్రి, రాజేశ్వర్, సురేశ్, వెంకటనరసింహరావు, సీహెచ్.మోహన్, రాజేందర్, కృష్ణ, భూమారెడ్డి, ప్రవీణ్ కుమార్, రాజేశ్వర్, సాయన్న పలువురు దీక్ష శిబిరాన్ని సందర్శించి, వారికి సంఘీభావం తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలను గుర్తించాలి

నవతెలంగాణ-తాండూర్



రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. మంగళవారం తాండూర్ సర్కిల్ పరిధిలోని తాండూర్ పోలీస్‌స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో కలిసి సందర్శించారు. పోలీస్ అధికారులు పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టి ప్రజలతో మమేకమవ్వాలన్నారు. పోలీస్ అధికారులు సిబ్బంది వివరాల గురించి ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ పరిధి భౌగోళిక పరిస్థితులు, ప్రజల జీవన విధానం పరిసర ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు, వారి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే నేరాల వివరాలు, పోలీసుల విధి నిర్వహణలో రాజకీయ ప్రమేయం, రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీట్స్ వివరాలు తెలుసుకున్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ కుమారస్వామి ఎస్సై కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు 8న చలో హైదరాబాద్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఉద్దేశంతో జనవరి 8న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబాడే లహుకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యా కోర్సులు చేస్తున్న 12లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు ఫీజు బకాయిలు విడుదల చేయకుండా ఇబ్బంది పెట్టిందని, అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా పేద విద్యార్థులకు ఫీజులు ఇవ్వకపోవటంతో 12 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే దిశగా చేపట్టిన చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజన్న, రాకేష్, నవీన్, శ్రీకాంత్, మహేష్, శిరీష, ప్రియాంక, మౌనిక, సారిక, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పండగలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎమ్మెల్యే కోవలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు శ్యాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండగలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. శాంతి సౌభ్రాతృత్వం, కరుణాక్షమగుణం, నేర్పే ఏసుక్రీస్తు అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు అహ్మద్, పాస్టర్లు పొన్నాల నారాయణ, టి.రాజు, రాజేష్, సుప్రీమ్, జాన్ పాల్, బండి రాజు, మురళి, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై గళం విప్పుతా

నవతెలంగాణ-నార్నూర్

పట్టభద్రులు ఆదరించి గెలిపిస్తే ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపై మండలిలో గళం విప్పుతానని, పట్టభద్రుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ కాలేజ్‌లో ఉపాధ్యాయులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు సంపూర్ణ మద్దతు తెలుపాలని కోరారు. ఎమ్మెల్సీగా ఆశీర్వదించి, గెలిపిస్తే పట్టభద్రులకు, నిరుద్యోగులకు అండగా ఉంటానని, వారికి ఉన్న సమస్యలను పరిష్కారానికి మండలిలో ప్రశ్నించే గొంతుకగా పోరాడుతానని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో ఉన్న పట్టభద్రులకు రూపాయికే హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తానన్నారు. గతంలో కరీంనగర్ మేయర్‌గా అవకాశం ఇస్తే నగర ప్రజల కోసం మున్సిపల్ పరిధిలో ఉన్న పార్కులు రక్షించి అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ పాల్గొన్నారు.



సీఆర్టీల సమ్మెకు దివ్యశ్రీ ఫౌండేషన్ మద్దతు

నవతెలంగాణ-నార్నూర్



వారం రోజులుగా ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న సీఆర్టీలకు మద్దతుగా మంగళవారం సమ్మెలో దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ మద్దతు తెలిపారు. సమ్మెలో సీఆర్టీలకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సీఆర్టీలకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వారికీ ప్రతి నెల ఒకటో తేదీన వేతనం ఇవ్వాలని, మహిళా సీఆర్టీలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

దొంగ అరెస్టు

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రానికి చెందిన షేక్ మొయిన్, షేక్ సాజిద్, సిందే రాజా గత కొన్ని రోజుల నుంచి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై మనోహర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరికి పాల్పడిన నింధితులు మద్యం తాగుడుకు, జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. నింధితుల నుంచి 2.1 తులాల బంగారం, 70 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అనుమానితులుగా కనిపించిన వారు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే బహిరంగ లేఖ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులందరి న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు రెగ్యులర్ చేయాలని సమ్మెకు దిగారు. అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ వారిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలన్నారు.

సాయిబాబా ఆలయ చైర్మెన్‌గా గంగోని బూరాజ్ ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీ గండి రామన్న దత్త సాయిబాబా ఆలయ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప కమిషనర్ వరంగల్ జోన్ శ్రీకాంత్‌రావు ఉత్తర్వుల ప్రకారం... దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగు రవి కిషన్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మెన్‌గా గంగోని బూరాజ్ ధర్మకర్తలు మనోజ్ కుమార్, జొన్నల మనోహర్, కత్తి సురేష్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆనంద్‌రావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆలయ చైర్మెన్‌గా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుకి నూతన చైర్మెన్ ధన్యవాదాలు తెలిపారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని నూతన పాలకమండలి సభ్యులు పేర్కొన్నారు. ఇందులో ఆలయ ఈఓ రమేష్, దేవరకోట ఆలయ చైర్మెన్ శ్రీనివాస్, పట్టణాధ్యక్షులు నాందెడపు చిన్ను, నిర్మల్ రూరల్ మండలాధ్యక్షులు కుంట వేణుగోపాల్, కొంతం గణేష్, మనోజ్, ఆయన్నగారి పోశెట్టి, గుల్లె రాజన్న, ఆర్.చిరంజీవి, ఒడ్నం నరేందర్, గడ్డింటి ప్రశాంత్, నిమ్మ గణేష్, నాయకులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ఎంఏ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ టీఆర్ఎస్ఎంఏ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని రిసోనెన్స్ వరల్డ్ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో నూతన ఆదిలాబాద్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.ప్రమోద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా గణేష్, టి.దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రావు, శ్యామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ రాథోడ్, సంయుక్త కార్యదర్శిగా కార్తీక్, జీవన్‌రెడ్డి, సదాశివరెడ్డి, కోశాధికారి శుద్దోధన్ ఎన్నికయ్యారు. వీరిని పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక వేషధారణలో అలరించారు. పండుగ విశిష్టత జీసస్ క్రీస్తు నాటకాన్ని ఉపన్యాసం ద్వారా వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ అశ్విని మాట్లాడుతూ ఏసుక్రీస్తు పుట్టుక, జీవితం అనుసరించిన విధానం, క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులతో కలిసి సంబరాలు చేసుకున్నారు.కార్యక్రమంలో జోనల్ అకౌంటెంట్ శ్రీనివాస్, పాఠశాల డీన్ వీ.శ్రీనివాస్, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి శైలజ, పీపీటీ ఇన్‌చార్జి శిరీష, పీఈటీ కిషన్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రిస్మస్ పండగకు ట్రినిటీ చర్చి సన్నద్ధం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

క్రైస్తవులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండగ క్రిస్టమస్‌కు స్థా నిక హోలీ ట్రినిటీ చర్చిలో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. హోలీ ట్రినిటీ చర్చి ఫాదర్ జెఏల్. జోసెఫ్ ఆధ్వర్యంలో పశువుల పాకను ఏర్పాటు చేశారు. ఈ రోజు రాత్రి యేసు సందేశం, గీతాలు దేవుని ఆరాధన తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మధ్య రాత్రి యేసు జననం సందర్భంగా కేక్‌ను కట్ చేసి భక్తి శ్రద్ధలతో ఆయన జన్మదినం చేయడం జరుగుతోందన్నారు. ఈ పండగను పదకొండు రోజుల పాటు ప్రతి ఇంటి వద్ద ఆటలు, పాటలు, యేసు సందేశం ఇస్తూ జరుపుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని రత్నాపూర్ కాండ్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 2007-08 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో విద్యార్థులు పాల్గొని, ఉత్సాహంగా గడిపారు. 16 ఏండ్ల కింద పాఠశాలలో చదువు ముగించుకుని, వివిధ వృత్తులలో స్థిరపడిన విద్యార్థులు ఒకే చోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి గురువులను ఘనంగా సన్మానించుకున్నారు.

యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీలు రద్దు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో గతంలో వేసిన యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీలు రద్దు చేస్తున్నట్టు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే నూతన కమిటీలు వేసే వరకు ఎవరు కూడా యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులుగా చెప్పుకోకూడదని వివరించారు.